దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులు

ఉత్తమ నటుడు షారుఖ్‌ఖాన్

దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం రాత్రి ముంబయిలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు బాలీవుడ్ తారలు, దర్శకనిర్మాతలు హాజరయ్యారు. 'జవాన్' చిత్రానికిగాను బాలీవుడ్ అగ్ర హీరో షారుఖ్‌ఖాన్ ఉత్తమ నటుడిగా, చిత్ర కథానాయిక నయనతార ఉత్తమ నటిగా అవార్డులను స్వీకరించారు. గత డిసెంబర్‌లో విడుదలై దేశవ్యాప్తంగా సంచలన విజయం సాధించిన 'యానిమల్' చిత్రానికిగాను సందీప్ రెడ్డి వంగా ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన షారుఖ్‌ఖాన్.. జనరంజకమైన చిత్రాల ద్వారా ప్రేక్షకులను అలరించడమే తన అభిమతమని పేర్కొన్నారు. 'మంచి సినిమాలు చేస్తానని మీకు మాటిస్తున్నా. యాక్షన్, రొమాంటిక్, కామెడీ ఏ జోనర్ చిత్రమైనా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసేందుకు ప్రయత్నిస్తా' అని షారుఖ్‌ఖాన్ పేర్కొన్నారు.

సహజంగా కనిపించడం ఇష్టం

కెరీర్ ఆరంభంలో తాను కొన్ని విచిత్రమైన అనుభవాలను ఎదుర్కొన్నానని, దర్శకులు తన పాత్ర విషయంలో ఏం చెబుతున్నారో అర్థమయ్యేది కాదని చెప్పింది అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కెరీర్ తొలినాటి అనుభవాలను పంచుకుందీ భామ. ఆమె మాట్లాడుతూ 'కెరీర్ తొలినాళ్లలో ఓ సినిమా ఆడిషన్‌కు వెళ్లాను. దర్శకుడు సినిమాలోని పాత్ర గురించి ఏం చెబుతున్నారో అర్థం కాలేదు. ఓ లుక్ టెస్ట్‌కు వెళ్లినప్పుడు కూడా ఫొటోగ్రాఫర్ నాకు ఆ పాత్ర సూట్ కాదన్నట్లుగా మాట్లాడాడు. ఆ తర్వాత ఆయనే వచ్చి క్షమాపణ చెప్పాడు. ఇలాంటి అనుభవాలు ఎన్నో ఉన్నాయి' అని తెలిపింది. అయితే సినిమాల విషయంలో తనకు కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయని, తన పాత్ర విషయంలో దర్శకుడితో పాటు తన టీం కూడా సహాయం చేస్తుందని చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్. 'కొందరు నన్ను బరువు తగ్గితే బాగుంటుందని చెబుతుంటారు. కానీ ఆ అవసరం లేదు. తెరపై సహజంగా కనిపించడానికే నేను ప్రాధాన్యతనిస్తాను. దర్శకులు సూచనల మేరకు నటిస్తే ఏ పాత్రలోనైనా రాణించవొచ్చని నేను నమ్ముతాను' అని మృణాల్ ఠాకూర్ పేర్కొంది. ప్రస్తుతం ఈ భామ విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది.

అగ్ర హీరో రకుల్‌ప్రీత్‌సింగ్ మనసిచ్చిన ప్రియుడిని మనువాడింది. బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీతో కలిసి ఈ పంజాబీ భామ ఏడడుగులు వేసింది. బుధవారం గోవాలో ఈ జంట వివాహం ఘనంగా జరిగింది. ఇరు కుటుంబ సభ్యులతో పాటు పలువురు బాలీవుడ్ తారలు ఈ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరుల్ని ఆశీర్వదించారు. వీరి పెళ్లి ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. రకుల్‌ప్రీత్‌సింగ్ గత మూడేళ్లుగా జాకీ భగ్నానీతో ప్రేమలో ఉంది. 2021 అక్టోబర్‌లో తన సోషల్‌మీడియా ద్వారా ప్రేమ విషయాన్ని వెల్లడించింది. మూడేళ్ల ప్రేమాయణం అనంతరం నచ్చిన చెలికాడితో కొత్త జీవితాన్ని ఆరంభించింది రకుల్‌ప్రీత్‌సింగ్.

'కంగువ' కోసం...

సూర్య కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'కంగువ'. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పది భాషల్లో తెరకెక్కిస్తున్నారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్నాయి. పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌గా భారీ హంగులతో తెరకెక్కిస్తున్నారు. ఇందులో యుద్ధవీరుడి పాత్రలో సూర్య కనిపించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కిస్తున్న ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటించనున్నారు. త్రీడీ ఫార్మాట్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. నిర్మాణానంతర కార్యక్రమాల్లో భాగంగా డబ్బింగ్ పనులను మొదలుపెట్టారు. హీరో సూర్య డబ్బింగ్ వర్క్ స్టార్ట్ చేశాడు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆ ఫొటోను విడుదల చేసింది. దిశాపటానీ, యోగిబాబు, బాబీ డియోల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిస్వామి, కథ: శివ, ఆది నారాయణ, నిర్మాతలు: కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్, దర్శకత్వం: శివ.

పవర్‌ఫుల్ పోలీస్ 'భీమా'

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భీమా'. ఏ.హర్ష దర్శకుడు. శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా మార్చి 8న విడుదలకానుంది. బుధవారం ఈ సినిమా టైటిల్ సాంగ్ 'గల్లీ సౌండుల్లో' విడుదలైంది. 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ స్వరపరచిన ఈ పాటను సంతోష్ వెంకీ ఆలపించారు. గోపీచంద్ పాత్ర స్వభావాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. నేరస్థులను భయపెట్టే ఓ స్ట్రిక్ట్ పోలీసాఫీసర్ వ్యక్తిత్వాన్ని తెలియజేస్తూ మాస్ బీట్‌లో ఈ పాట ఆకట్టుకుంది. ఈ చిత్రంలో గోపీచంద్ పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో కనిపిస్తారని..మాస్, ఫ్యామిలీ, యాక్షన్ అంశాల కలబోతగా సినిమాను తెరకెక్కించామని దర్శకుడు తెలిపారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె గౌడ, సంగీతం: రవి బస్రూర్, సంభాషణలు: అజ్జా మహంకాళి, దర్శకత్వం: ఏ.హర్ష.

దిష్టిబొమ్మచుట్టూ కథ నడుస్తుంది

''భూతద్దం భాస్కర్ నారాయణ' డిటెక్టివ్ థ్రిల్లర్స్‌లో విభిన్నమైన చిత్రం. డిటెక్టివ్ కథను పురాణాలతో ముడిపెట్టిన విధానం చాలా కొత్తగా అనిపిస్తుంది' అన్నారు స్నేహాల్, శశిధర్. వారిద్దరు నిర్మాతలుగా తెరకెక్కించిన ఈ చిత్రంలో శివ కందుకూరి హీరోగా నటించారు. పురుషోత్తం రాజ్ దర్శకుడు. మార్చి 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం నిర్మాతలు స్నేహాల్, శశిధర్ పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు..

ఈ సినిమా స్క్రిప్ట్ విన్నప్పుడే అద్భుతంగా అనిపించింది. ఈ కథలోని మైథలాజికల్ ఎలిమెంట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. అదే సమయంలో డిటెక్టివ్ పరిశోధన కూడా కొత్తరకంగా అనిపిస్తుంది. గూఢచారి పాత్రలో శివ కందుకూరి అద్భుతంగా ఒదిగిపోయాడు. నేచురల్ పర్‌ఫార్మెన్స్ కనబరిచాడు. బడ్జెట్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా అత్యుత్తమ క్వాలిటీతో ఈ సినిమాను తెరకెక్కించాం. ఓటీటీ, ఓవర్సీస్ బిజినెస్ ఇప్పటికే పూర్తయింది.

దిష్టిబొమ్మ నేపథ్యంలో..

ఇళ్ల ముందు దిష్టిబొమ్మను పెట్టుకోవడం ఓ ఆచారంగా వస్తున్నది. అయితే దానివెనకున్న అసలు కథేమిటో చాలా మందికి తెలియదు. ఈ పాయింట్‌కు ఫాంటసీ ఎలిమెంట్‌ను జోడించి దర్శకుడు ఈ సినిమాను ఆద్యంతం ఉత్కంఠభరితంగా నడిపించాడు. ఇందులో శివ ట్రాన్స్‌సాంగ్ లిరికల్ వీడియో కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను ఉపయోగించాం. శ్రీచరణ్ అందించిన బీజీఎమ్ మరో స్థాయిలో ఉంటుంది.

మంచి కంటెంట్‌తో సినిమా తీశారు

అభినవ్ గోమఠం, వైశాలిరాజ్ జంటగా నటిస్తున్న చిత్రం 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా'. తిరుపతి రావు ఇండ్ల దర్శకుడు. కాసుల క్రియేటివ్ వర్క్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలకానుంది. మంగళవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. యువ హీరో వరుణ్‌తేజ్ ముఖ్య అతిథిగా హాజరై బిగ్ టికెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కమెడియన్‌గా అభినవ్ తనకంటూ ప్రత్యేకతను సృష్టించుకున్నాడు. చక్కటి కంటెంట్‌తో ఈ సినిమా చేశారు' అన్నారు. ఈ సినిమా తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైనదని, ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొని పూర్తిచేశామని, కథలోని కొత్తదనం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందని అభినవ్ గోమఠం చెప్పారు. ఈ సినిమాలోని ప్రతి పాత్ర గుర్తుండిపోతుందని నిర్మాతలు ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్ వి పేర్కొన్నారు.

పుత్రోత్సాహంలో నిఖిల్

యువ హీరో నిఖిల్ తండ్రయ్యారు. ఆయన సతీమణి డాక్టర్ పల్లవి బుధవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తను నిఖిల్ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. తన కుమారుడిని ముద్దాడుతున్న ఫొటోలను షేర్ చేశారు. 'మా ప్రేమకు గుర్తుగా ఈ చిన్నారిని మా జీవితాల్లోకి ఆహ్వానిస్తున్నాం. సెలబ్రేషన్స్ చేసుకోవాల్సిన తరుణమిది' అంటూ నిఖిల్ సోషల్‌మీడియాలో పేర్కొన్నారు. నిఖిల్, పల్లవిల వివాహం 2020లో జరిగింది. 'కార్తికేయ-2' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపును తెచ్చుకున్నారు నిఖిల్. ప్రస్తుతం ఆయన 'స్వయంభూ' చిత్రంలో నటిస్తున్నారు. దీనితో పాటు 'ది ఇండియా హౌస్' 'కార్తికేయ-3' చిత్రాలకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

ఫేక్ ఇన్‌స్టా అకౌంట్ యూజర్‌పై ఫిర్యాదు

తన పేరు మీద ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఖాతాను సృష్టించి ఉద్యోగాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై అగ్ర కథానాయిక విద్యా బాలన్ ముంబయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి విద్యా బాలన్ పేరు మీద ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ అకౌంట్ ఓపెన్ చేశాడు. అది విద్యాబాలన్ ఒరిజినల్ ఇన్‌స్టా అకౌంట్ ఐడీకి దగ్గరగా ఉండటంతో చాలా మంది ఫాలో కావడం మొదలుపెట్టారు. ఇదే అదనుగా సదరు వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఫాలోవర్స్ నుంచి డబ్బులు వసూలు చేయడం మొదలుపెట్టాడు. ఈ విషయం విద్యాబాలన్ దృష్టికి రావడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. దాంతో పోలీసులు ఆ నిందితున్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. తన పేరు మీద ఉన్న నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఐడీలను రిపోర్ట్ చేయాలని విద్యాబాలన్ అభిమానులను కోరింది.

14రోజుల్లో ఏం జరిగింది?

మనోజ్, చాందిని జంటగా నటించిన చిత్రం '14డేస్ లవ్'. నాగరాజు బోడెం దర్శకత్వం వహిస్తున్నారు. హరిబాబు దాసరి నిర్మాత. ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కుటుంబ విలువలను కాపాడే ప్రయత్నంలో ఓ ఇంటి వారసులు ఎదుర్కొన్న సమస్యలు ఏమిటి? ఓ ప్రేమజంట కథకు ఎలాంటి ముగింపు దొరికింది? అనే ఆసక్తికరమైన అంశాల చుట్టూ కథ నడుస్తుంది. ఫ్యామిలీ, సెంటిమెంట్, వినోదంతో ఆకట్టుకుంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కన్నన్ మునుస్వామి, సంగీతం: కిరణ్ వెన్న, మాటలు: గౌరీశ్వర్, శివప్రసాద్ సామల, దర్శకత్వం: నాగరాజు బోడెం.

సస్పెన్స్ థ్రిల్లర్ 'ఇంటి నెం 13'

నవీద్‌బాబు, శివాంగి మెహ్రో, ఇర్ఫాన్, నికీషా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఇంటి నెం 13'. పన్నా రాయల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని హేసన్ పాషా నిర్మించారు. మార్చి 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'మిస్టరీ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ప్రతి పదినిమిషాలకు వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులకు థ్రిల్‌ని కలిగిస్తుంది. విజువల్ ఎఫెక్ట్స్ ప్రధానాకర్షణగా నిలుస్తాయి' అన్నారు. ఆనంద్‌రాజ్, తనికెళ్ల భరణి, పృథ్వీరాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పి.ఎస్.మణికర్ణన్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: పన్నా రాయల్.